


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**"గాంధారి శాపం అంటే?"** అడిగాడు మట్టూ... కొంచెం ఆలోచిస్తూ.

"గాంధారి ఇద్దర్ని శపించింది. మొదటివాడు శ్రీకృష్ణుడు. గాంధారి చాలా తెలివైందీ, మృదు స్వభావీ కూడా. అయినా ఆవేశం, ఆక్రోశం వచ్చినప్పుడు ఆ తెలివీ, మృదుత్వమూ మాయమైపోతాయి. అందుకే కుంతికి, మాద్రికి పిల్లలు కలిగారన్న ఉక్రోషంతో తన పొట్టమీద పిడికిళ్ళతో కొట్టుకుని గర్భవిచ్చితికి కారణమైంది. అయితే వ్యాసులవారి దయవల్ల కౌరవులు బతికి బట్టగట్టారు. అది వేరే విషయం.

తన నూరుగురు కొడుకులూ, అల్లుడు జయద్రథుడూ (సైంధవుడు) కృష్ణుని మాయోపాయం వల్లనే మరణించారనే ఆగ్రహంతో కృష్ణుని సంతానమూ, బంధుమిత్రులేగాక సర్వ యాదవ సైన్యం కూడా నశించిపోవాలని శపించింది. కృష్ణుడు కూడా మరణించాలనేది కూడా ఆ శాపంలో భాగం. కృష్ణుడు చిరునవ్వుతో ఆ శాపాన్ని స్వీకరించాడు. గాంధారి మరొక శాపం తన తమ్ముడైన శకునిపైన. గాంధారి, శకుని గాంధార రాజైన సబలుడు అతని భార్య సుధర్మల బిడ్డలు. వీరుకాక ఇంకెందరో పుత్రులున్నా ముఖ్యులు వీరిద్దరూ. తన తల్లిదండ్రుల్ని, సోదరుల్నీ కారణాలవల్ల పోగొట్టుకున్న శకునికి

కౌరవులపై అమితమైన పగ. ఆ పగని లోపలే దాచుకుని పైకి మేనల్లుడైన దుర్యోధనుని మీద ప్రేమ నటిస్తూ, పరోక్షంగా కౌరవుల మరణానికి కారణమయ్యాడని శకునిని శపించింది.

ఆ శాపం ఏమంటే, గాంధార (కాందహార్) దేశం ఎప్పుడూ అశాంతితో యుద్ధవాతావరణంతో రక్తమోడుతూ ఉంటుందని, అక్కడి ప్రజలు శాంతిగా ఏనాడూ అక్కడ నివశించలేరనీ, అనుక్షణం భయభ్రాంతులుగా బ్రతకాలనీ శపించింది.

ఆ శాపం ఎంత నిజమంటే, అప్పటికీ ఇప్పటికీ కూడా కాందహార్ (ఆఫ్ఘనిస్తాన్) అశాంతితోటే అలమటిస్తోంది. తీవ్రవాదుల చేతుల్లో ప్రజలు నరకయాతన పడుతూనే ఉన్నారు. సుస్థితర, శాంతి అనేవి ఆ దేశంలో మృగ్యం. ప్రపంచం ముందుకెళ్తుంటే, అక్కడ మాత్రం వెనక్కు వెనక్కి వెళ్ళి పాలకులు అటవిక న్యాయం అమలు పరుస్తున్నారు" వివరించారు యజ్ఞప్ప.

"అసలు తప్పు ఎక్కడుందంటే, మనుషులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ చేసే ప్రతిజ్ఞల వంటివాటివల్ల. ఆ విషయం గాంధారి విషయంలో ముమ్మాటికీ నిజం. భర్త గుడ్డివాడు. అలాంటప్పుడు భార్య కళ్ళకి గంతలు కట్టుకుని గుడ్డిదానిలా మెలగటం సబబా? తండ్రి బిడ్డల బాగోగులు చూసే అవకాశం లేదు. గాంధారి అయినా కళ్ళతో పిల్లల్ని గమనిస్తూ వారి బాగోగులు చూస్తూ వారిని మంచి మార్గంలో పెట్టవచ్చుగా? ఆ పని చెయ్యకుండా బిడ్డల్ని చెడు మార్గంలోంచి సన్మార్గానికి మళ్ళించకపోవడం ఒక తప్పయితే, కళ్ళూ చెవులూ మూసుకుని కౌరవుల్ని ఇష్టారాజ్యంగా పెరగనివ్వడం మరో తప్పు. ఆ తప్పుల్ని గుర్తించకుండా తన ఆగ్రహాన్ని కృష్ణుని మీద శాపం రూపంలో గుప్పించడం ఇంకో తప్పు. అందుకే వారి అంత్యక్రియలు చెయ్యడానికి ఒక్క బిడ్డ కూడా మిగల్లేదు" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"చాలా చక్కగా వివరించారు.. కానీ, సర్పశిల దగ్గర ముసలి అవ్వ 'ఇది గాంధారి శాపం' అని అనడంలోని అర్థం ఏమిటీ? గాంధారి శాపానికీ తక్షపురంలో ఉండే సర్పశిలకీ, ముసలావిడ త్వరలో రాబోతున్నది అని చెప్పిన ప్రకృతి విలయ తాండవానికీ సంబధం ఏమిటీ? కౌరవ పాండవుల యుద్ధ పరిసమాప్తి తరవాతేగదా పాండవులు పరీక్షిత్తుకి పట్టంగట్టి వెళ్ళిపోయింది. పరీక్షిత్తు చనిపోయిన కొన్ని సంవత్సరాల తరవాతగదా అతని కుమారుడు జనమే జయుడు 'పట్టాభిషిక్తుడై' సర్పయాగం తలపెట్టింది! అలా చూస్తే గాంధారికీ తక్షకుడికీ సంబంధం ఏమిటీ? గాంధారి గాంధార రాజకుమార్తె. తక్షకుడు నాగజాతివాడు. మరి గాంధారి శాపానికీ తక్షకుడు సృష్టించనున్న విలయానికీ సంబంధం ఏమిటి?" శ్రద్ధగా, స్పష్టంగా అడిగాడు శ్రీనివాస్.

"చాలా మంచి ప్రశ్న శ్రీనివాస్‌గారు" అన్నది మదాలస.

"అవును. మహాభారత కథ నాకు పూర్తిగా అవగాహన కాలేదు. కానీ, యీ ప్రశ్న మాత్రం చాలా లోతైనది" తెలుగులోనే అన్నది శరద్వతి. ఆమె తెలుగుని చాలా చాలా చక్కగా వేగంగా నేర్చుకుంటోంది. అత్తగారి పర్యవేక్షణలో.

"శాపాలలో కూడా అనేక రకాలు ఉన్నాయి శ్రీనివాసా. పిల్లి కూడా శాపాలు పెడుతుంది" నవ్వారు శాస్త్రిగారు.

"నిజమా" ఆశ్చర్యంగా అడిగాడు శృంగి.

"అవును. దాని టైముకి గనక తిండి పెట్టకపోతే పిచ్చి బూతులు తిడుతుంది. వాటినే పిల్లి శాపాలంటారు" అన్నారు శాస్త్రిగారు.

"రుజువుందా?" అడిగారు డాక్టర్.

"మహారాజాలా ఉంది. రెండు పిల్లులు ఘోరంగా అరుచుకుంటున్నప్పుడో, యుద్ధం చేస్తున్నప్పుడో మీరు వాటి అరుపుల్ని టేప్ రికార్డర్లో రికార్డు చెయ్యండి. మళ్ళీ అవి కామ్ అయిపోయినప్పుడు టేప్ రివైండ్ చేసి ఆ అరుపుల్ని వాటికి వినిపించండి. ఎంత కంగారుగా భయంగా పరిగెడతాయో మీకే తెలుస్తుంది. మనకి వాటి భాష అర్ధంకాకపోయినా, వాటికి అర్ధమవుతుందిగా. యజమాని ఆహారం పెట్టేవరకు ఎన్ని గంటలైనా కుక్కలు ఓపిగ్గా ఎదురుచూస్తాయి. అదే పిల్లులైతే శాపనార్ధాలు పెడతాయి" వివరించారు శాస్త్రిగారు. (ఈ ఎక్స్‌పెరిమెంటు ఎవరైనా చేసి చూడొచ్చు.)

"సరే మరి గాంధారి శాపం ఏ రకం కిందకి వస్తుందీ?" అడిగాడు మట్టు.

"కొన్ని శాపాలు వ్యక్తులతోబాటు అంతమైపోతాయి. కొన్ని శాపాలు తరాల్ని కుట్టి కుదుపుతాయి. కొన్ని శాపాలు యుగం మారినా ఫలిస్తూనే వుంటాయి. కాందహార్ పరిస్థితి కళ్ళారా చూస్తున్నారుగా! ఇక శ్రీకృష్ణుడి సంగతీ అతని యాదవ సైన్యం గురించా? ఆయనకు మరణంతో ఆ శాపం తీరినా, అతని బంధుమిత్రులకీ, సైన్యానికీ తీరలేదు. తీరదు కూడా. ఎందుకంటే, గాంధారి అప్పటి ధర్మాన్నీ న్యాయాన్నీ వ్యవస్థనీ కూడా శపించింది. మరో మహా యుద్ధం జరిగి మహా భారతంలో పాల్గొన్న సైనికులంతా హతమైతేగానీ ఆ శాపం తీరదు. ఒక యుగంలో రెండు ఘోరమైన సంగ్రామాలు జరగడం అతి అరుదు. అందుకే ద్వాపర యుగపు శాపాలు కలియుగంలోగానీ నివృత్తి అవవు" చెప్పారు శాస్త్రిగారు.

"కొంత అర్ధమైంది కొంత కొంత కాలేదు" అన్నాడు శ్రీనివాస్.

"అవును. కొంత అర్ధమవుతుంది. కొంత కాదు. అసలు మనమంతా ఇక్కడ ఎందుకున్నాం? దేనికోసం వేచి చూస్తున్నాం? ఇన్నాళ్ళపాటు స్పష్టమైన పనీపాటా లేకుండా ఎందుకున్నాం. ఈ డాక్టరుగారూ వారి సతీమణీ మనకి ఇన్ని సౌకర్యాలతో ఇలా ఎందుకు సేవచేస్తున్నారూ? ఇంకెంత కాలం మనం వీరికి అతిధులుగా ఉంటాం? ఈ ప్రశ్నలకి సమాధానం మన దగ్గర ఉందా? నాకు తెలుసు.. ఎవరి వద్దా సమాధానం లేదని. మన కళ్ళెదుట ఉన్నదానికీ, జరుగుతున్న దానికీ సమాధానాలు మనకి లేనప్పుడు, మహా భారతకాలం నాటి శాపాల లోతుల్ని ఎలా కొలవగలం? కానీ, పిల్లల్లారా ఒక ప్రశ్న పుట్టినప్పుడు దానికి సమాధానం కూడా తప్పక పుట్టి తీరుతుంది. సమాధానం చెప్పి సందేహం తీర్చేవారు కూడా పునర్జన్మ పొందిన అప్పటివారే" స్పష్టంగా అన్నారు శాస్త్రిగారు.

"అప్పటివారా? మళ్ళీ పుట్టడమా?" షాక్‌తో అన్నాడు శ్రీనివాస్.

"ఆశ్చర్యం ఎందుకూ? గోవిందరాజస్వామి ఆలయంలో రాబీ తెలుగులో మాట్లాడలేదూ, విలియమ్స్ అనే ఇంగ్లీషు ఆత్మ నిన్ను ఆవహించలేదూ? రాబీనే స్పష్టంగా ఎవరూ చెప్పకుండానే గోవిందరాజస్వామి ఆలయంలో ఎంతో పరిచయం ఉన్నవాడిగా గబగబా లోపలికి నడిచి, 'అప్పుడు ఇలా లేదు' అని చెప్పలేదూ? రాబీది పునర్జన్మ కాదా? శరద్వతీ నువ్వూ ఎక్కడ కలిశారు. ఎందుకు కలిశారూ, ఎలా పెళ్ళి చేసుకున్నారూ? ఇవన్నీ గత జన్మల సంబంధంకాదా? ఆలోచించు" నవ్వి అన్నారు శాస్త్రిగారు.

చిరునవ్వుతో తల పంకించారు యజ్ఞప్ప.

ఒక్కసారిగా అందరూ మౌనమై ఆలోచనల్లో మునిగారు. డాక్టరుగారి ఇంట్లోని ఫోన్ మ్రోగింది. ఆయన లోపలికి వెళ్ళగానే యజ్ఞప్ప మదాలసతో "మనం తలచుకున్నాంకదా.. బహుశా ఫోన్ చేసింది సుదర్శన్ కావొచ్చు" అన్నారు.

"అదెలా?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీనివాస్.

"మనిషికీ మనిషికీ కమ్యూనికేషన్స్ ఉన్నట్టు మనసుకీ మనసుకీ కూడా కమ్యూనికేషన్స్ ఉంటాయి. అదో విచిత్రమైన సబ్జెక్టు" చిన్నగా నవ్వి అన్నారు యజ్ఞప్ప.

"మదాలసా... సుదర్శన్ ఫోన్ చేసి నిన్నడిగాడు. లోపలికి రామ్మా" అంటూ లోపలనించి పిలిచారు డాక్టర్‌గారు. గబగబా లేచి లోపలికి వెళ్ళింది మదాలస.

శాస్త్రిగారి మొహంలో ప్రశాంతమైన చిరునవ్వు కదలాడటం అందరూ గమనించారు.

"అయ్యా పంచభూతలింగాలు అయిదు. 1. ఆకాశలింగం. ఇది తమిళనాడు చిదంబరంలో ఉంది. తొమ్మిది గోపురాలు కలిగిన అద్భుతమైన ఆలయం అది. శివుడు నటరాజుగా, చంద్రమౌళీశ్వరుడిగా, శూన్యరూపమైన చిదంబరేశ్వరుడిగా ఇక్కడ నిలచి ఉంటాడు. ఓ వస్త్రం వెనుక వున్న శూన్య ప్రదేశాన్నే చిదంబర రహస్యం అంటారు" వివరించారు మహదేవన్ ఇంగ్లీషులో.

"సో నైస్ మా అదృష్టం ఇలా మంచి విషయాలు వినడం" అన్నాడు శమంతో.

"రెండవది పృథ్వీలింగం. ఇది కాంచీపురంలో ఉంది. ఆలయం పేరు ఏకామ్రేశ్వర ఆలయం. ఈ లింగాన్ని పూజించే కామాక్షి కంచి కామాక్షి అమ్మవారిగా భక్తులని తరింప చేస్తున్నారు. ఇది ఓ మామిడి చెట్టు ( ఆమ్ర వృక్షం) కింద ఉండటం వలన ఏకామ్రేశ్వరాలయ లింగంగా, పృథ్వీ లింగంగా పూజింపబడుతున్నది. ఈ శివలింగానికి అభిషేకాలు చెయ్యరు. ఇసుకతో చేయబడింది కనుక. ఆదిశంకరాచార్యులవారు స్థాపించిన పీఠాలలో అత్యంత శక్తివంతమైన మఠం యీ కంచిలోనే ఉంది. సాక్షాత్తూ ఆదిశంకరులవారే ఈ మఠాన్ని ప్రారంభించారు. నడిచే దేవుడిగా కొనియాడబడ్డ పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిగారు ఇక్కడి పరమాచార్యులే. వారి శిష్యులు శ్రీ జయేంద్ర సరస్వతి. వారి తరువాత పీఠాన్ని అలంకరించింది శ్రీ జయేంద్ర సరస్వతి. వారి తరువాత పీఠాన్ని అలంకరించి చంద్రమౌళీశ్వర స్వామిని

ఇన్ని తరాలుగా ప్రస్తుతం నిత్యపూజలు చేస్తున్న వారు శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి. ఈ కంచి పట్టుచీరలకే కాదు, అద్భుతమైన ఆలయాలకు శిల్ప సంపదకూ ఆలవాలమైనది. అత్యున్నత ఆలయ గోపురాలు, కంచి వరదరాజస్వామి వారి గుడి ఉన్నాయి. ఆ గుడి కొలనులోనే 40 సంవత్సరాలకి ఒకసారి నీళ్ళలోంచి పైకి వచ్చి పూజలందుకునే అత్తి వరదస్వామి ఉన్నారు. ఆ అద్భుత విగ్రహం అత్తి వృక్షపు కాండంతో చేయబడింది. 40 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే అత్తి వరదుడ్ని బైటకి తీసి, ఒక నెల రోజులు పూజోపచారాలు  చేసి మళ్ళీ ఆ స్వామిని జలంలో  ప్రవేశ పెడతారు. అంతేగాదు, కూర్మ నాధాలయం, ఉళహ పెరుమాళ్ (వామనావతారం) ఆలయం అబ్బో కంచి చుట్టుపక్కల ఏడువందల ఆలయాలు ఉన్నాయి. కొన్ని కాలక్రమాన పూజలకు నోచుకోకపోయినా కాలానికి సాక్షులుగా శిల్ప కళకి నీరాజనాలు పలుకుతూనే ఉన్నాయి. అతుకేలేని రాతి గొలుసులు ఎలా చేశారోగానీ ఇప్పటికీ వాటిని చూడడం ఓ అనుభవమే, ఆశ్చర్యమే. కంచి, కంచి ఆధ్యాత్మిక పీఠమూ, కంచి స్వాములూ నిజంగా పూజనీయము.

రెండవదైన పృధ్వీ లింగం గురించి వివరించారు మహదేవన్.

"కంచి తప్పకుండా చూడాలి, ఎలాగైనా సరే" అన్నాడు డాంటే. అతనికే కాదు అందరికీ కంచినీ ఆలయాన్నీ చూడాలనిపించింది.

"ఇప్పుడు మనం చూడబోతున్నది అరుణాచలం అనే యీ వూరిలో, అరుణాచలేశ్వర ఆలయంలో కొలువున్న అగ్నిలింగాన్ని. ఇదో అద్భుతమైన ఆలయం. ఎన్నో విధాలుగా ప్రత్యేకమైనది. అదిగో ఆ కొండ పేరు అరుణ గిరి. భగవాన్ రమణ మహర్షి ఆ గిరి చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఆ ప్రదక్షిణనే 'గిరి వల్లం ' అంటారు. అష్టభుజి ఆకారంలో దారి ఉంటుంది .పూర్తి ప్రదక్షిణ దూరం 14 కిలోమీటర్లు. ఆలయంలోనున్న అగ్ని లింగం నుంచి క్లాక్ వైజ్ (గడియారపు నడకలో) బయల్దేరితే 1 అగ్నిలింగం, 2 యమలింగం, 3 నిరుతి లింగం, 4 వరుణ లింగం, 5 వాయులింగం, 6 కుబేర లింగం, 7 ఈశానలింగం, 8 ఇంద్ర లింగం. ఇలా ఎనిమిది అద్భుత లింగ దర్శనాలు చేసుకోవచ్చు. గర్భగుడిలో ఎంత వేడిగా ఉంటుందంటే, అనుభవించి తెలుసుకోవచ్చు. గుడిలో కూడా పంచభూత లింగాలున్నాయి. అద్భుతమైన గాలిగోపురాలతో లక్షలాది సందర్శకులతో నిత్యనూతనంగా వర్ధిల్లుతున్న పరమ పవిత్ర స్థలం యీ అరుణాచలం" భక్తిగా, శ్రద్ధగా వర్ణించారు మహాదేవన్.

"ముందు ఎక్కడికీ? ప్రదక్షిణకా, గుడికా?" అడిగాడు శమంతో.

"ముందు గుడికే వెడదాం. తెల్లవారుఝామున అయితే గిరిప్రదక్షిణం ఆహ్లాదకరంగా అద్భుతంగా ఉంటుంది" చిరునవ్వుతో అన్నారు మహాదేవన్.

"ధన్యోస్మి" అన్నాడు జయ్. అతనుండేది మద్రాసులోనైనా తిరువణ్ణామలై దర్శించడం ఇదే మొదటిసారి. ఊరి గురించీ, ప్రత్యేకత గురించీ తెలుసు, కానీ దర్శించడం ఇదే మొదటిసారి. అందరూ నడుస్తున్నారు.   "అయ్యా మూడిటి

గురించి చెప్పారు. అంటే, ఆకాశ పృధ్వీ, అగ్ని లింగాల గురించి చెప్పారు. ఇంకా రెండు ఉన్నాయిగా, వాయు, జల లింగాలు. అవి ఎక్కడున్నాయి?" అడిగాడు శమంతో.

"అవును. జల లింగం జంబుకేశ్వరంలో ఉంది. దాన్నే తిరువనై కొవల్, తిమేవకాయ్ అని కూడా పిలుస్తారు. ఏడు గోపురాల అద్భుతాలయం అది. పానపట్టం నించి నిరంతరం నీరు వూరుతూ వుంటుంది. అందుకే జల లింగేశ్వరుడు అంటారు. అలాగే, తిరుపతి దగ్గరున్న శ్రీ కాళహస్తిలో వాయులింగం ఉన్నది. ప్రాణం ఉన్న లింగం యీ వాయు లింగం మాత్రమే అంటారు. లింగంలో నించి వచ్చే ఉచ్చ్వాస నిశ్వాసాలకు దీపం కదలడం స్పష్టంగా కనబడుతుంది. ఇక్కడే రాహుకేతు దోషాలు పోవడానికి పూజలు నిత్యం జరుపడతాయి. ఈ సజీవ అద్భుత లింగాన్నే కర్పూర లింగం అని కూడా అంటారు. స్వర్ణముఖీ నదీ తీరాన ఉన్న యీ శ్రీకాళహస్తీశ్వర క్షేత్రం సర్వపాపాలనూ పోగొట్టి సుఖ సంపదలనిస్తుందని ప్రజల నమ్మకమే కాదు, సత్యం కూడా" అన్నారు మహదేవన్.

"హిందూ మతం అనేది ఓ అద్భుతమైంది. న్యాయంగా చెబితే ఇది మతం కాదు. అత్యంత సంస్కారవంతమైన జీవన విధానం. ఈ విధానంలో కప్ప, పాము ,సాలీడు, ఏనుగు, కోతి, కుక్క, పక్షి, చేప, చెట్టు, రాయి రప్ప కూడా పూజలందుకుంటాయి. సర్వ సమానత్వాన్ని  బోధిస్తుంది ఈ హిందూ ధర్మం. ప్రకృతిని రక్షించడం ఎలానో కొన్ని వేల ఏండ్ల క్రితమే మన పూర్వీకులు మనకి వివరించారు. అయితే మనం ఆ దారిని వదిలి, దారి తప్పి, దిక్కుతోచని స్థితిలో పడుతున్నాం" అన్నాడు శమంతో.

"నిజం నిజం" అన్నాడు గోర్కీ.

రాబీ మాత్రం మౌనంగా నడుస్తున్నాడు. ఏనాడూ కలగని గగుర్పాటు యీరోజు అతనికి కలుగుతోంది. జయ్ అతన్ని గమనిస్తూనే ఉన్నాడు. ప్రవస్థి అందర్నీ గమనిస్తూ, మహాదేవన్ మాటల్ని శ్రద్ధగా వింటు నడుస్తున్నాడు.

"త్రిశూలాన్ని ధరించిన సన్యాసి మహా కాళేశ్వరంలో మరో తొమ్మిది తీర్థాలు దర్శించుకోమని చెప్పారు కదా. అవి ఏవి?" హనుమంతు మహామాయని అడిగాడు.

"అరుణాచల గిరిప్రదక్షిణతో సర్వతీర్థ దర్శన ఫలం లభిస్తుందని ప్రతీతి. ఇప్పుడు మనం వెళ్తున్నది అక్కడికే" చిన్నగా నవ్వి అన్నది మహామాయ. ఆవిడ హనుమంతుని ఓ చిన్న బిడ్డగా భావించి మాతృప్రేమ వర్షిస్తోంది.

"అమ్మా.. అలా షార్ట్ కట్ ఆలోచన చెయ్యొచ్చా?" అడిగాడు హనుమంతు. వాళ్ళెక్కిన రైలు గాలిని చీల్చుకుంటూ పరిగెడుతోంది. అప్పుడు వస్తున్న శబ్దం ఓంకారంలా ధ్వనిస్తోంది.

"నాయనా ప్రతి  తీర్థమూ పుణ్యప్రదమైనదే. అరుణాచలం మరింత పుణ్య ప్రదం. అంతేకాదు ఇది మహాకన్యాదేవి గురువు శ్రీశ్రీశ్రీ పరమ పవిత్ర నిశ్చలానంద గారి సూచన.గురువు ఆజ్ఞ తలదాల్చడం శిష్యుల ప్రధమ కర్తవ్యం" అన్నది మహామాయ.

కిటికీలోంచి బయటికి చూశాడు హనుమంతు. రైలు లోపలి నీలి బల్బుల కాంతి తప్ప బయట అంతా చిమ్మచీకటి. ఆ చీకట్లో దూసుకుపోతున్న రైలు శబ్దం మరింత స్పుటంగా వినిపిస్తోంది. పట్టాల మీద నించి అప్పుడప్పుడూ నిప్పురవ్వలు ఎగిసిపడటం కూడా చూశాడు హనుమంతు.

అతనికి క్షిప్రా నది  మనసులోకి వచ్చింది. ఒక్కసారి మనసు ఉలిక్కిపడ్డది. మహాకన్యాదేవి చెప్పిన కంకాళాల దృశ్యం అతని కళ్ళముందు కదలాడి ఒళ్ళు జలదరించింది. అకాలంలో అకారణ వర్షం మొదలైంది.. ఓంకారంతోపాటు జోరు జడివాన.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments